అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

జగదేవ్‌పూర్, మే 8 (ప్రభాతవార్త): గ్రామాలను అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదామని బిజివెంకటాపూర్ సర్పంచ్ చెక్కల పరమేశ్వర్‌ముదిరాజ్, తిమ్మాపూర్ సర్పంచ్ రాజులు అన్నారు. శుక్ర వారం బిజివెంకటాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో బాలవికాస్ ఆధ్వర్యంలో ఆదర్శ గ్రామాల నిర్మాణానికై గ్రామసభలు నిర్వహించారు. సమావేశంలో సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధికి చేయూత నందిస్తే అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామన్నారు. బాలవికాస్ సంస్థ రాష్ట్రంలో పలు గ్రామాల అభివృద్ధికి ఎన్నో అభివృద్ధి పథకాలను కొనసాగిస్తూ కృషి చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి ఏ ఒక్కరితో సాధ్యం కాదని, గ్రామ పౌరులు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా మార్పు సాధ్యమవుతుందని అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజివెంకటాపూర్ ఉపసర్పంచ్ పోకల బాబు, వార్డు సభ్యులు బాలరాజు, సుధాకర్, కె.బాలమణి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు, తిమ్మాపూర్ పంచాయతీ కార్యదర్శి విక్రమ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యలు అవాస్తవం : డిఎస్‌పి సత్తయ్య

కొండాపూర్, మే 8 ప్రభాతవార్త : కొండాపూర్ మండలం తోగర్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి గురువారం పోలీసులపై చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని డిఎస్‌పి సత్తయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ, అలియాబాద్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న పరిశ్రమ యజమానిపై ఫోన్లో అసభ్య పదజాలంతో దూషించడంతో అతను కంప్లైంట్ ఇవ్వడం వల్ల శ్రీధర్‌రెడ్డిని పిఎస్‌కు పిలిపించడం జరిగిందన్నారు. విచారణలో భాగంగానే అతను మహిళా అధికారి అని చూడకుండా అసభ్య పదజాలంతో దూషించడం వల్ల అతని కింద కూర్చోపెట్టడం జరిగిందన్నారు. ఆ మర్యాద తామే పోగొట్టుకోవడం వల్ల ఘటన జరిగింది. తనపైన కేసు అయిపోయిందని తన వీడియోలో ఒప్పుకున్నాడు అతనికి చట్టంపై ఏ రకమైన అభిప్రాయం ఉందో ఆయన్ని గుర్తుచేసుకోవాలని చెప్పారు. తనపై కేసులు లేవని చెప్తున్నాడు కానీ ఐదు కేసులు వున్నాయి. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ సమస్య ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, గ్రామ సభ్యులతో చర్చించి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సుమన్, కుమార్, ఎస్‌ఐ సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ చైర్మన్‌గా తిరిగి ప్రమాణ స్వీకారం చేస్తున్న దేవేందర్‌రెడ్డి

పిఎసిఎస్ చైర్మన్‌గా దేవేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

కొండపాక, మే 8, ప్రభాతవార్త : వ్యవసాయ సహకర పరిపతి సంఘం చైర్మన్‌గా చిట్టి దేవేందర్‌రెడ్డి హైకోర్టు తీర్పుననుసరించి శనివారం తిరిగి ప్రమాణ స్వీకరం చేశారు. పిఎసిఎస్ పాలకవర్గాల పదవి కాలం ముగిసిన తర్వాత మరికొంత కాలం పదవి కాలాన్ని పొడగిస్తున్నట్లు అప్పట్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాని ప్రభుత్వం ఇచ్చిన కాలం పూర్తికాకుండానే ఇచ్చిన గడువును ఉపసంహరించుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో ఇచ్చిన సమయం పూర్తికాకుండా ఎలా ఉప సంహరించుకుంటరంటు పిఎసిఎస్ చైర్మన్‌లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు అదేశాల మేరకు వారిని పిఐసిలుగా కొనసాగించాలని తీర్పునివ్వడంతో డిసిఒ ఉత్తర్వులను అనుసరించి అధికారులు కొండపాక ఎపిసిఎస్ కార్యాలయంలో పిఎసిఎస్ చైర్మన్‌తోపాటు పాలకవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు.

కిష్టాపూర్ పిఎసిఎస్ చైర్మన్‌గా మల్లేశం గౌడ్

బాధ్యతలు స్వీకరిస్తున్న సహకార సంఘం అధ్యక్షుడు మల్లేశంగౌడ్

కొల్చారం, మే 8 ప్రభాతవార్త : హైకోర్టు తీర్పుతో ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గత పాలకవర్గాన్ని కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం మేరకు కొల్చారం మండలం కిష్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మాజీ చైర్మన్‌లతోపాటు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. సంఘం చైర్మన్‌గా మల్లేశంగౌడ్, వైస్ చైర్మన్‌గా ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లేశం మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నవీన్, డైరెక్టర్లు నారాయణ, షేర్ పల్లి షేకులు, చాతరి ప్రమీల, సార డాటాగౌడ్, వెంబడి శేఖర్, అత్యం శ్రీనివాస్, చిట్యాల చిన్న పోచయ్య, అందుల పల్లి శ్రీరాములు, సిబ్బంది యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మనోహర్

కొల్చారం సొసైటీ చైర్మన్ మనోహర్

కొల్చారం, మే 8 ప్రభాతవార్త : కొల్చారం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా నాగురి మనోహర్ బాధ్యతలు స్వీకరించారు, గత సంవత్సరం ఫిబ్రవరిలో వారి పదవీకాలం పూర్తయినందున ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పదవిలో కొనసాగారు, ప్రత్యేక అధికారుల పాలనలో ప్రాథమిక సొసైటీలు కొనసాగాయి. గత ప్రభుత్వం సహకార సంఘాల పాలకవర్గాలను రద్దు చేయడంతో చైర్మన్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఏప్రిల్ 28వ తేదీన తిరిగి పాత పాలకవర్గాలకు అధికారాలు ఇస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది ఈ నేపథ్యంలో చైర్మన్ తో పాటు డైరెక్టర్లు మళ్ళీ విధులలోకి చేరారు శుక్రవారం వారు బాధ్యతలు స్వీకరించారు, సందర్భంగా సొసైటీ చైర్మన్ నాగురి మనోహర్ మాట్లాడుతూ రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని కొనుగోలును వేగవంతం చేయాలని రైస్ మిల్లులకు చేరుకున్న లారీలను త్వరగా ఖాళీ చేయించి కొనుగోలు కేంద్రాలకు వద్దకు లారీలను పంపించే విధంగా అధికారం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ పార్థి గారి కృష్ణ, అటెండర్ బిట్ల నర్సింలు, సొసైటీ డైరెక్టర్లు, ఉన్నారు.

కుల వివక్షకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

-గజ్వేల్ ఎసిపి కె.నర్సింలు

జగదేవ్‌పూర్, మే 8 (ప్రభాతవార్త): గ్రామాల్లో ఎవరైనా కుల వివక్ష చూపినట్లయితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏసిపి కె.నర్సింలు అన్నారు. జగదేవ్‌పూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో జరిగిన ఎస్సీ,ఎస్టీ కేసుకు సంబంధించి శుక్రవారం గ్రామాన్ని జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డితో కలిసి సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించిన సాక్షులను విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసిపి నర్సింలు మాట్లాడుతూ సాంకేతికంగా ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో కులాల పేరుతో వివక్ష చూపడం, అవమానించడం వంటి చర్యలు సమాజానికి మచ్చగా నిలుస్తాయని అన్నారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి సమాన హక్కులు కల్పించిందని, దేశంలో ప్రజలు అందరూ సమానమేనని అన్నారు. ప్రజలు కులం అనే మూఢ భావనలు, సంకుచిత ఆలోచనల నుండి బయటకు రావాలని, సమానత్వ భావనతో అందరు కలిసిమెలసి జీవించాలన్నారు. ఇకపై ఎవరైనా కులాల పేరుతో దూషణలు చేయడం, సామాజికంగా అవమానించడం లేదా వివక్షకు పాల్పడితే వారిపై ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి తప్ప చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనంతసాగర్ గ్రామ సర్పంచ్ కుమార్, తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గజ్వేల్ ఏసిపి నర్సింలు

పశు సంపద పెంపుపై దృష్టి సారించాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

చౌటకూరు, మే 8, ప్రభాతవార్త: మానవ మనుగడకు పశుసంపద అత్యంత కీలకమని, పాల ఉత్పత్తి లేకుంటే మానవ వనుగడ కష్టతరమవుతుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సరాఫ్ పల్లిలో పశు వైద్య సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ నందికంటి రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన అవగాహనకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ పశు సంపద పెంపు పై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ప్యాకెట్ పాలకు అలవాటు పడ్డారని, ఇంటికో పాడి గేదె ఉండేలా చొరవ చూపితే పాలు, పెరుగు, నెయ్యి ఇతరాత్ర పశు ఉత్పత్తులు లభ్యమవుతాయన్నారు. పాడి పశువుల సాకితే నిత్యం ఆదాయం అందుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఉచితంగా పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తుందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారులు వారం, పక్షం రోజులకు ఇంటికి వచ్చి పశువుల ఆరోగ్యం, వాటి సంరక్షణకుఉ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తుంటారన్నారు. ఆసక్తిగల రైతులు పశు సంపద అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ వసంతకుమారి, డీఏవో శివప్రసాద్, డీసీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ నామాల కిష్టయ్య,ఆర్ఐ ప్రమోద్‌కుమార్, ఎంపిఓ సువర్ణ, పశువైద్యాధికారరి విశాల్, గోపాల మిత్ర పర్యవేక్షకులు ఆర్జునయ్య, మత్స్య శాఖ అధ్యక్షులు వెంకటేశం, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు, విజయడైరీ డిప్యూటీ డైరెక్టర్ రమేష్, ఇంచార్జి మేనేజర్ నిఖిత, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్పోలులో ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

పుల్‌కల్, మే 8, ప్రభాతవార్త: ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని కోర్పోలుగ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం కలెక్టరనప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వస్తున్నట్లు తెలుసుకున్న రైతులు సరాఫ్‌పల్లికి చేరుకుని ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ధాన్యం కొనుగోలు మందకోడిగా సాగుతోందని,రోజుల తరబడి ధాన్యం రాసులు అలాగే ఉండిపోయాయని రైతులు కలెక్టర్ దృష్టికి తేగా స్పందించిన కలెక్టర్ వెంటనే సరాఫ్‌పల్లి నుంచి కోర్పోలుకు చేరుకుని కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో సమాయానికి తూకం వేయడం లేదంటూ రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కేంద్రంలో 14 మంది హమాలీలు ఉన్నారని, హమాలీల కొరతతో కొనుగోలులో జాప్యం జరుగుతోందని నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. రైతులు యాసంగి వరి గణనీయంగా సాగుచేశారని, అందుకు గ్రామంలో మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. కొనుగోలు కేంద్రంలో మరో 14 మంది హమాలీలను ఏర్పాటు చేసుకుని తూకంవేయాలని నిర్వాహకులకు కలెక్టర్ ఆదేశించారు.

రెవెన్యూ, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చుగూడెం సునీత ప్రవీణ్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న సూపరింటెండింగ్ ఇంజనీర్ లక్ష్మణ్

నీటి వనరుల సంరక్షణ ప్రతి రైతు బాధ్యత

-ఎస్ఈ లక్ష్మణ్

మర్కుక్, మే 8 (ప్రభాతవార్త): సాగునీటి వనరులను సంరక్షించుకునే బాధ్యత ప్రతి రైతుపై ఉందని ఎస్ఈ లక్ష్మణ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు వారోత్సవాలు నిర్వహించారు. కొండపోచమ్మ రిజర్వాయర్ సమీపంలోని మర్కుక్ పంప్‌హౌస్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల స్థాయిని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రిజర్వాయర్లు, కాల్వలు, పంప్‌హౌస్‌ల అభివృద్ధితో రైతులకు సాగునీటి సౌకర్యాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ప్రతి రైతు బాధ్యత అని, నీటి సరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ఆధునిక సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. రైతు సంక్షేమం మరియు ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యనిర్వహణాధికారి విటిటి శ్రీనివాస్ మాట్లాడుతూ సాగునీటి పంపిణీలో రైతుల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. రైతులు బాధ్యతాయుతంగా నీటిని వినియోగిస్తే నీటి వనరులను దీర్ఘకాలికంగా సంరక్షించుకోవచ్చన్నారు. రైతు వారోత్సవాల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మర్కుక్ సర్పంచ్ రాణి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, డిప్యూటీ ఇంజనీర్లు శ్రీధర్, చండిరాం, భాస్కర్, జీవన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఇరిగేషన్ ఏఈ అభిలాష్, డివిజన్ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నోడల్ ఆఫీసర్ డిఎవో స్వరూపరాణి

సిద్దిపేట అర్బన్, మే 8, ప్రభాతవార్త : ప్రభుత్వ సంక్షేమ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి పొందాలని నోడల్ ఆఫీసర్ డిఏవో స్వరూపరాణి సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం అర్బన్ మండలం పొన్నాలలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్ లో జిల్లాస్థాయి మత్స్యకారుల అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులు సూచించిన సూచనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.ప్రభుత్వం సకాలంలో ఉచిత చేపపిల్లలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరారు. అన్ని చెరువులు, కుంటలలో చేప పిల్లలను వదిలేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.కాగా ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ఎలాంటి పథకాలు అమలు చేస్తుందో అధికారులు తెలియజేయకుండా చెరువులు, కుంటలు, సొసైటీలు, సభ్యుల లెక్కలు చెప్పడంతో మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సదస్సులో కనీస సౌకర్యాలు ఏర్పాటుచేయకపోవడంతో మత్స్యకార్మికులు అధికారుల తీరుపై మండిపడ్డారు. కార్యక్రమానికి సంబంధం లేకుండా పనికి మాలిన లెక్కలు చెబుతూ పీపీటీ ద్వారా వివరించడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం మీద అవగాహన సదస్సు తూతూ మంత్రంగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకున్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ గౌతమి, సొసైటీ సభ్యులు,నాయకులు జంగిటి శ్రీనివాస్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో పాల్గొన్న డిఏవో స్వరూపారాణి

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మహమ్మద్‌నగర్ సొసైటీ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

కౌడిపల్లి, మే 8, ప్రభాతవార్త: అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా వేగంగా జరిగేలా చూడాలని నిర్వహకులకు జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ హితువు పలికారు. శుక్రవారం కౌడిపల్లి మండలం మహమ్మద్ నగర్ సొసైటీ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. నిర్వాహకులను ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత మందికి టోకెన్ ఇచ్చారు? ఎంత కొనుగోలు చేసారు? లారీలు ఏ టైంకి వస్తున్నాయి? లోడింగ్, అన్‌లోడింగ్‌కి ఎంత టైం పడుతుంది తదితర వివరాలను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలలో, మిల్లులలో సమస్యలు తలెత్తితే వెంటనే రాత పూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలని, చర్యలు తీసుకుంటామని రైతులకు ఆయన భరోస కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలుచేసి, 14వేల మంది రైతులకు రూ. 52 కోట్లను బ్యాంక్ ఖాతలో జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటాం రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన చెప్పారు. అకాల వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకోవడానికి టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచుకోవడం మంచిదని ఆయన తెలిపారు. లోడింగ్‌ప్రక్రియను త్వరగా చేపట్టాలని, లేబర్‌ను లారీలను అందుబాటులో ఉంచుకోవాలని, నిబంధనల మేరకు తేమ శాతం ఉండాలని, నిర్వాహకులకు ఆయన సూచించారు.

పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలం

నర్సాపూర్ రూరల్, మే 8 (ప్రభాతవార్త): పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలమని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సాపూర్ మండలం రామచంద్రాపూర్ గ్రామంలో పశు చికిత్స,అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ శిబిరాన్ని ప్రారంభించి దూడలు, గొర్రెలు, మేకలకు నులిపురుగుల నివారణ మందులు వేయించారు. అనంతరం రైతులకు ఖనిజ మిశ్రమాన్ని పంపిణీ చేశారు. శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదన్నారు. పశువులకు టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో రామచంద్రాపూర్ సర్పంచ్ సరిత, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటయ్య, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ వేణుగోపాలుని పుష్పరథోత్సవం

వర్గల్, మే 8 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం వివిధ రకాల పూలతో అలంకరించిన రథంపై సతీసమేతులైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను అధిష్టింపజేసి గ్రామ పురవీధుల్లో అత్యంత వైభవంగా ఊరేగింపును నిర్వహించారు. ఈ పుష్ప రథోత్సవాన్ని తిలకించడానికి మండల పరిధిలోని పరిసర గ్రామాల భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అలాగే హనుమాన్ మాలధారణ స్వాములు కార్యక్రమంలో పాల్గొని రథంను లాగడం జరిగింది. ఈ సందర్భంగా రథోత్సవం ముందు మహిళల కోలాటం, పలువురి నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

భారీ భక్తజనం మధ్య శ్రీ వేణుగోపాలస్వామి పుష్పరథోత్సవ దృశ్యం

జనగణనలో ప్రజలు భాగస్వాములు కావాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి చిత్రంలో డిపిఆర్ఓ రవికుమార్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

జనగణన-2027 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కల్పించిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్, జిల్లా ప్రధాన జనగణన అధికారి కె. హైమావతి సూచించారు. జనగణన-2027పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక ప్రచార వాహనాన్ని శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పన, వనరుల పంపిణీ వంటి కీలక అంశాలకు జనగణన ఆధారంగా పని చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రచార వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రచార వాహనం ద్వారా సాంస్కృతిక సారథి కళాకారులు జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో 20 రోజుల పాటు పర్యటిస్తూ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు జనగణన ప్రాముఖ్యతను వివరిస్తారని తెలిపారు. జనాభా లెక్కల నమోదు ప్రక్రియలో ప్రతి కుటుంబం తమ పూర్తివివరాలను అందించడం అవసరమని కలెక్టర్ వివరించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఈనెల 10 వరకు అవకాశం ఉండడంతో ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్ల ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపిఆర్ఓ రవికుమార్, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, డిపిఆర్ఓ కార్యాలయ సిబ్బంది రాంబాబు, సాంస్కృతిక సారథి కళాకారులు కళాంజలి రాజేష్, వెంకటాపురం రవి, డప్పుబాబు, కొమ్ము రవి, ఎల్లం, రవి,తిరుమలేష్, భార్గవి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

-పలువురికి గాయాలు

జగదేవ్‌పూర్, మే 8 (ప్రభాతవార్త): మండల పరిధిలోని చాట్లపల్లి గ్రామ శివారులో ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా పలువురు గాయాలపాలయ్యారు. ఎస్ఐ కృష్ణారెడ్డి కథనం ప్రకారం... కరీంనగర్ జిల్లా విద్యానగర్‌కు చెందిన కదారి బీరయ్య కుమారుడు కదారి శివకుమార్(19) స్నేహితులతో కలిసి హనుమాన్ మాల ధరించగా స్వర్ణగిరి ఆలయానికి వెళ్లేందుకు గురువారం రాత్రి 10.30 గంటలకు ఆటో (టిజి02 టి4311)లో బయల్దేరారు. రాత్రి 1.10 గంటలకు జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామ రైతువేదిక సమీపంలోకి చేరుకోగా ఎదురుగా అతివేగంగా వచ్చిన టిఎస్09 ఎఫ్ఎస్ 4816 నెంబర్ గల కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కదారి శివకుమార్ తలకు, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ బానోత్ రాజు, ప్రయాణికులు చిగురుమామిడి చంద్రప్రకాష్, మరుపాక సంతోష్, రిషిత్ సాయి, హేమంత్‌లకు తీవ్ర గాయాలు కాగా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం జాలసింగారం గ్రామానికి చెందిన బతుల శ్రీశైలం(29)గా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

చిన్నకోడూరు, మే 8, ప్రభాతవార్త : పొలంలో తెగిపడిన విద్యుత్ వైర్ తగిలి రైతు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కస్తూరిపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన రైతు పరుమాల మల్లేశం(55) పొలంలో తెగిపడిన విద్యుత్ వైర్ తగిలి షాక్‌తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చిన్నశంకరంపేట, మే 8, ప్రభాతవార్త: కుటుంబ కలహలతో వివాహిత ఆత్మహత్యా యత్నం చేసిన సంఘటన చిన్నశంకరంపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నశంకరంపేటకు చెందిన రేణుక(25), ఉదయం ఇంట్లో కుటుంబసభ్యులతో గొడవపడి పట్టణ శివారులో ఉన్న సంగారెడ్డి బావిలో దూకింది. బావిలో నీరు ఎక్కువగా లేకపోవడంతో రేణుకకు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడ పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు గమనించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మెదక్ అగ్నిమాపక సిబ్బంది సహాయంతో రేణుకను బయటకు తీసి అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ శివానందం తెలిపారు.

ఘనంగా చిత్తారమ్మదేవి విగ్రహప్రతిష్ఠ

-ఆలయానికి 51వేల రూపాయల విరాళం సిజిఆర్

చిత్తారమ్మదేవి విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

జిన్నారం, మే 8, ప్రభాతవార్త:
జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్లకుంటలో శ్రీచిత్తారమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికోసం తనవంతుగా 51వేల రూపాయల ఆర్థిక సాయాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. గోవర్ధన్‌రెడ్డికి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, స్థానికనాయకులు, మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

-మినీ మంచినీటి ట్యాంకు ప్రారంభించిన సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి

మినీ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

గుమ్మడిదల, మే 8, ప్రభాతవార్త:
గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి మినీ మంచినీటి ట్యాంకును ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను వార్డుసభ్యులు ప్రేమ్‌కుమార్, శ్రావణినవీన్ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన సర్పంచ్ పెంటారెడ్డి కాలనీలో మినీ మంచినీటిట్యాంకు ఏర్పాటుచేసి సమస్యకు పరిష్కారం చూపించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్, ఉపసర్పంచ్ పాషా, వార్డుసభ్యులు ప్రేమ్‌కుమార్, శ్రావణినవీన్, పెంటేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజాత్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు గడ్డం యాదగిరి, పోతురాజు సుధాకర్, ఆశీర్వాదం, కుమ్మారి వెంకటేష్, పోచయ్య, నతనైలు, మురళి, కాంతి, ప్రవీణ్, గ్రామపెద్దలు బాల్‌రెడ్డి, రాజయ్య, చంద్రయ్యతోపాటు కాలనీ మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని 10, 11వార్డుల్లో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనచేశారు. ఈ పనులతో కాలనీలో పారిశుధ్య సమస్యలు తగ్గి ప్రజలకు మెరుగైనవసతులు కలగనున్నాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవేందర్‌గౌడ్, ఉపసర్పంచ్ పాషా, వార్డుసభ్యులు ప్రేమ్‌కుమార్, నవీన్, పెంటేష్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అంజాత్‌ఖాన్, సీనియర్ నాయకులు ఇప్ప నర్సింహరెడ్డి, గడ్డం యాదగిరి, సుధాకర్, ఆశీర్వాదం, వెంకటేష్, గ్రామ పెద్దలు బాల్‌రెడ్డి, మురళి, బాలారం, పోచయ్య, నతనైలు, కాంతి, ప్రవీణ్, చంద్రయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వీయగణనతోనే వాస్తవమైన సమాచారం

-అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ టి.నరసింహులు

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జిన్నారం, మే 8, ప్రభాతవార్త:
జనాభా గణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా వాస్తవమైన సమాచారాన్ని నమోదు చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ గణన చేసుకోవాలని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ టి.నరసింహులు సూచించారు. శుక్రవారం అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని ఐడిఎ బొల్లారం విఘ్నేశ్వర కాలనీలో దీనిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వయంగా వెబ్‌సైట్ ద్వారా వివరాలను అప్‌డేట్ చేయడం వల్ల ఆశించిన ప్రయోజనం కలుగుతుందని, గణన చేసే సిబ్బందికి పని భారం తగ్గుతుందని వివరించారు. ఈ స్వీయగణన గడువు ఈనెల 10తో ముగుస్తుందని, ఆతర్వాత మే9వరకు ఇళ్లజాబితా నమోదుప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ఫిబ్రవరి 2027లో ప్రధానగణన జరుగుతుందని వెల్లడించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వీయగణన పూర్తి చేయాలని కోరారు. అనంతరం మైత్రి హిల్‌వ్యూ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, విఘ్నేశ్వర కాలనీ సంఘం అధ్యక్షుడు మురళి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలు

-రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

వెల్దుర్తి, మే 8, ప్రభాతవార్త:
వ్యవసాయ రైతులు వరిపంటకు ప్రత్యామ్నాయంగా ఉద్యానవనం పంటలైన ఆయిల్ పామ్స్, మామిడి లాంటి పంటలను సాగుచేసుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు శుక్రవారం జరిగిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా శెట్టిపల్లి, మానేపల్లి గ్రామాల్లో రైతులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయంలో రసాన్ని ఎరువులు. పురుగు మందులు అధికంగా వాడడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని, దిగుబడి తగ్గుతాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వీటిని అధిగమించడానికి సేంద్రియ ఎరువులు, పశువుల, కోళ్ల, గొర్రెల, ఎరువులను అధికంగా వాడాలని అలాగే యూరియా వాడకాన్ని తగ్గించుకోవడం ద్వారా పురుగులు, తెగులబారి నుండి తగ్గించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి ప్రొఫెసర్ డాక్టర్ డి. విజయలక్ష్మి, పిజె టిఎసి అధ్యాపకులు మహదేవప్ప, శాస్త్రవేత్త పుష్పవల్లి, ప్రొఫెసర్ ఎఈఓ ఉత్తమ్‌కుమార్, చంద్రవేణి, గ్రామసర్పంచ్ శేఖర్, సోమప్ప, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నల్లవల్లి రైతుల భూములు కాపాడాలి

-చిన్న, సన్నకారు రైతులకు న్యాయంచేయాలని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి
-గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నల్లవల్లి గ్రామస్థులు

గుమ్మడిదల, మే 8, ప్రభాతవార్త:
గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి గ్రామ రైతుల సాగుభూములను పరిరక్షించాలని కోరుతూ గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ సర్పంచ్ కొర్వ రాణిసురేష్ నేతృత్వంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ వినతిపత్రంలో గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 142, 160 ప్రాంతాలకు సంబంధించిన భూములు తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సుమారు 337 ఎకరాల అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రభుత్వ అవసరాల దృష్ట్యా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ పేరుతో భూములు తీసుకుంటే గ్రామరైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఈ భూములపై ఆధారపడి అనేక కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు వరి, కూరగాయలు, పత్తి, మామిడి తోటలు తదితర పంటలను సాగు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారని వివరించారు. నల్లవల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో నీటి వసతి సమృద్ధిగా ఉండటంతో సంవత్సరానికి మూడు పంటలు పండే సారవంతమైన భూములు ఉన్నాయని తెలిపారు. ఈ భూములు కోల్పోతే రైతుల ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింటుందని, గ్రామ ప్రజలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల జీవనాధారమైన భూములను కాపాడేందుకు ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. గ్రామ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కోరారు. రైతుల భూములను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు.

అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో

అధికారులతో మాట్లాడుతున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

వెల్దుర్తి, మే 8, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తహసీల్దార్ కార్యాలయంలో అటవీశాఖ, రెవెన్యూశాఖల అధికారులతో తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంగళపర్తి, హస్తల్‌పూర్, గ్రామాల పరిధిలోని సర్వేనెంబర్ 401, 283లకు సంబంధించిన అటవీ, రెవెన్యూ హద్దు వివాదంపై సమావేశం నిర్వహించారు. అధికారులకు పలు సూచనలు, సలహాలను ఆర్డిఓ జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైస్ మిల్లును సందర్శించిన ఆర్డీవో

రైస్ మిల్లర్లకు సూచనలిస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

వెల్దుర్తి, మే 8, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన వెల్దుర్తి లోని మహాగణపతి రైస్ మిల్లును శుక్రవారం నాడు తూప్రాన్ ఆర్డిఓ జయచంద్రారెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా రైస్ మిల్ యజమానులతో ఆర్డీవో మాట్లాడుతూ మిల్లర్లకు ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడ్‌చేయాలని, వేగంగా అన్‌లోడింగ్ జరగడానికి తగినసంఖ్యలో హమాలీలను ఏర్పాటుచేసుకోవాలని ఆయన సూచించారు. హస్తాల్‌పూర్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డిఓ జయచంద్రారెడ్డి సందర్శించారు. దాన్ని త్వరితగతిన కొనుగోలు జరిపించి లారీల ద్వారా రైస్ మిల్లర్లకు అన్‌లోడింగ్ చేసే ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ పాల్గొన్నారు.

రేపు పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాని బహిరంగసభ

-బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బుచ్చేష్‌యాదవ్

నర్సాపూర్, మే 8, ప్రభాతవార్త:
ఈ నెల 10న రేపు హైదరాబాద్‌లో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని బిజెపి పార్టీ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా దేశప్రధాని నరేంద్రమోడీ హాజరవుతున్నట్టు తెలిపారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణ రహదారులకు మహర్దశ పట్టనుందని పేర్కొన్నారు. అంతేగాక రాష్ట్రంలో 3వేల కిలో మీటర్లకు పైగా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్లో నిర్వహించే నరేంద్రమోడీ ముఖ్యఅతిథిగా పాల్గొననున్న బహిరంగ సభకు బిజెపి నాయకులు, కార్యకర్తలు, బిజెపి అభిమానులు అధికసంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బుచేష్ యాదవ్ కోరారు.

ప్రధాని బహిరంగసభను విజయవంతం చేయండి

-విలేకరుల సమావేశంలో మాజీ ఎంపి బిబి పాటిల్ పిలుపు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి బిబి పాటిల్

జహీరాబాద్, మే 8, ప్రభాతవార్త:
ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జహీరాబాద్ మాజీ ఎంపి బిబి పాటిల్ బిజెపి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో బిజెపి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మూడురాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో బిజెపి ఘనవిజయం సాధించిన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారిగా హైదరాబాద్‌కు విచ్చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గంలోని నిమ్స్ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఈ స్మార్ట్ సిటీని 3,245 ఎకరాల్లో మొదటి దశలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.2,329 కోట్లు ఖర్చు చేయనున్నాయని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా జహీరాబాద్ ప్రాంతానికి భారీ ఎత్తున పరిశ్రమలు రానున్నాయని, భవిష్యత్తులో సుమారు మూడు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించబడనున్నాయని బిబి పాటిల్ అన్నారు. ఈసందర్భంగా ప్రజలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సభకు తరలిరావాలని విజ్ఞప్తిచేశారు. ఈ సమావేశంలో మాజీ డిసిసిబి చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి విజయమోహన్‌రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు గొల్ల భాస్కర్, నియోజకవర్గ కన్వీనర్ నౌబాద్ జగన్, నాయకులు ఎం.పాండురంగారెడ్డి, బి.రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ అప్పం శ్రవణ్, కృష్ణారెడ్డి, విజేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, అఫ్సర్ దిల్దార్ పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కలను నిజంచేస్తున్న కాంగ్రెస్

-మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేస్తున్న ఆంజనేయులుగౌడ్ తదితరులు

నర్సాపూర్, మే 8, ప్రభాతవార్త:
కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కల నిజం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలం రుస్తుంపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించుకున్న లబ్దిదారుల కోరిక మేరకు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ళను ఆంజనేయులుగౌడ్ చేతుల మీదుగా ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అ ధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇళ్లు అందజేస్తూ సొంతింటి కలలను నిజం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్, నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేశం, హత్నూర మండల అధ్యక్షులు క్రిష్ణ, సత్యం, సర్పంచ్ సురేష్‌నాయక్, తలారి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనారు.

సదాశివపేటలో డివైడర్ల మధ్య ముళ్ల పొదలు

-ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న ప్రధాన రహదారులు
-పురపాలకశాఖ నిర్లక్ష్యంపై ఆగ్రహం

ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో ముళ్ళ పొదలు

సదాశివపేట, మే 8, ప్రభాతవార్త:
సాధారణంగా పట్టణాల్లో రహదారులకు ఇరువైపులా, డివైడర్ల మధ్యలో పూలమొక్కలు, అలంకరణ మొక్కలు పెంచుతూ నగర సౌందర్యాన్ని పెంపొందించే ప్రయత్నాలు చేస్తుంటారు. కాని సదాశివపేటలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధాన కాలనీల్లోనూ, సదాశివపేట నుండి వికారాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి డివైడర్ల మధ్యలో ముళ్ల పొదలు విస్తారంగా పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా ద్విచక్రవాహనదారులు కొద్దిపాటి అదుపు తప్పినా, ఈ ముళ్ల పొదలు గుచ్చుకునే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారి డివైడర్లలో పెరిగిన పొదలు వాహనదారులకు ప్రమాదకరంగా మారినా, పురపాలకశాఖ సానిటరీ విభాగం పట్టించుకోవడంలేదని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. ఇంత ప్రధాన రహదారిలోనే ఈ పరిస్థితి ఉంటే, ప్రజలు నివసించే చిన్న గల్లీల్లో పారిశుధ్యం పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు అంటూ స్థానికులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. పట్టణ పరిశుభ్రత, సౌందర్యంపై పురపాలకశాఖ నిర్లక్ష్య వైఖరికి ఇదే నిదర్శనమని పలువురు మండిపడుతున్నారు. తక్షణమే ముళ్ల పొదలను తొలగించి రహదారులను శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పశువులకు గర్భధారణ చికిత్సలు

పాపన్నపేట, మే 8, ప్రభాతవార్త:
మండల పరిధిలోని నాగ్సాన్పల్లిలో శుక్రవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో 94గేదెలు, 48ఆవులకు గర్భధారణ చికిత్సలు చేసినట్లు పశు వైద్యాధికారులు సౌమ్య, ప్రవీణ్ తెలిపారు. పశువైద్య శిబిరం ముగింపు సమావేశంలో వారు మాట్లాడుతూ వేసవి కాలంలో పశువులను ఎండలో తిప్పకుండా నీడలో ఉంచాలని అన్నారు. ఎప్పటికప్పుడు తగినంత త్రాగు నీరు అందించాలని సూచించారు. పశువులకు గర్భధారణ, ఎదకురాని పశువులకు అందించాల్సిన చికిత్సల గురించి అవగాహన కల్పించారు. దూడలకు ముర్రుపాలు తాగించాలని, సమతుల ఆహారం అందించాలని, సరైన సమయంలో టీకాలు వేయించాలని కోరారు. 37 దూడలకు నట్టల మందువేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దండెం సుశీల, ఉప సర్పంచ్ సిరాజ్, జూనియర్ వెటర్నరీఆఫీసర్ ఎం.సతీష్‌కుమార్, శివాజీ, పులి సురేష్, సమీర్, అడిగప్ప, సుధాకర్, యాదయ్య, గోపాలమిత్ర సూపర్‌వైజర్ శ్రీనివాస్‌రెడ్డి, షర్ఫొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

-మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

కంగ్టి, మే 8, ప్రభాతవార్త:
బట్టలు ఉతికేందుకు బావికి వెళ్లిన తల్లి, ఇద్దరు చిన్నారి కుమార్తెలు బావిలో ప్రమాదావశాత్తు పడి మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని బోర్గిగ్రామంలో చోటుచేసుకుంది. మృతిచెందిన గిరిజనుల కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, బంజారా సేవాలాల్ సంఘ్ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ సభ్యులు రాములునాయక్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు కోరారు. రానున్న ఆదివారం బోర్గిగ్రామానికి చేరుకుని మృతుల కుటుంబాన్ని పరామర్శించి న్యాయం జరిగేలా చేస్తామని కలెక్టర్ హామీ చేసినట్లు రాములునాయక్ పేర్కొన్నారు. గ్రామంలో నీటిసమస్య తాండవిస్తోందని, నీరులేని కారణంగానే గ్రామస్థులు వ్యవసాయబావుల వద్దకు బట్టలు ఉతికేందుకు వెళుతుంటారని, ముగ్గురు వ్యవసాయబావికి బట్టలు ఉతికేందుకువెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందారని ఎమ్మెల్సీ విచారం వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకుపోయి గిరిజనకుటుంబానికి న్యాయంజరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ రాములునాయక్ పేర్కొన్నారు.

ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థికసాయం

జహీరాబాద్, మే 8, ప్రభాతవార్త:
హుగ్గేల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి గ్రామంలోని నిరుపేద ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థికసాయం అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గ్రామంలోని ఆడబిడ్డల వివాహాలకు తన వంతు సహాయం చేస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. శుక్రవారం హుగ్గేల్లీ గ్రామానికి చెందిన మోముల సంగీత - పాండురంగారెడ్డి కుమార్తె శృతి వివాహానికి హాజరైన సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి పెళ్లికానుకగా ఆర్థికసహాయాన్ని అందజేశారు. వధువు కుటుంబ సభ్యులు తమకుమార్తె వివాహానికి ఆర్థికసాయం అందించిన సర్పంచ్ విమల శ్రీనివాస్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల కూడా గ్రామానికి చెందిన పుట్టి వెంకట్ కుమార్తె వివాహానికి, అలాగే మరిపల్లి గొల్ల కంసమ్మ - మచ్చందర్ కుమార్తె వివాహానికి సర్పంచ్ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు మునిందర్‌రెడ్డి, రాములు, పాండు ముదిరాజ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా శివరాత్రి బిక్షంను నియమించాలి

-సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సమావేశంలో తీర్మానం

చిక్కడపల్లి, మే 8, ప్రభాతవార్త:
వడ్డెర కులస్తుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవికి, గత 15 ఏళ్లుగా కుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న శివరాత్రి బిక్షంను నియమించాలని తెలంగాణ వడ్డెరసంఘం డిమాండ్‌చేసింది. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సంఘం రాష్ట్రఅధ్యక్షులు, చైర్మన్ శివరాత్రి అయిలమల్లు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటుచేయడం హర్షణీయమని, అయితే చైర్మన్ నియామకంలో తీసుకున్న నిర్ణయం పునరాలోచించుకోవాలని కోరారు. 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, 604మండలాల ప్రతినిధులు ఏకగ్రీవంగా మద్దతుతెలిపిన శివరాత్రి బిక్షంను కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఎవరికీ పరిచయంలేని గుంజ రేణుకనారాయణను ప్రకటించడం సరికాదన్నారు. పాలకుర్తి నియోజకవర్గం, పెద్దవంగర మండలం, పోచంపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి బిక్షం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా క్షేత్రస్థాయిలో ఎంతోసేవ చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకుని బిక్షంను చైర్మన్‌గా నియమించాలని, లేనిపక్షంలో 33జిల్లాల్లో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్రకోశాధికారి గుర్రం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మంజల నగేష్, రాష్ట్ర కార్యదర్శులు వల్లపు శంకర్ రాజు, సంపంగి కృష్ణ, ప్రచార కార్యదర్శి గిరిశెట్టి రాజు పాల్గొన్నారు. అలాగే ఉద్యోగ సంఘం అధ్యక్షులు ఆలకుంట యాదగిరి, కార్మిక సంఘం అధ్యక్షుడు బోదాస్ నరసింహ, మహిళా అధ్యక్షురాలు శివరాత్రి ఉమా, యూత్ అధ్యక్షుడు ఒల్లెపు సాయికుమార్, ఇతర రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొని తమ నిరసనను వ్యక్తంచేశారు.

అద్భుతంగా సాగిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, మే 8, ప్రభాతవార్త:
బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్ గ్లోబల్ సర్వీసెస్ అధినేత, ప్రముఖ గాయకుడు టి.రామోజీ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా నాకళ్ళు చెబుతున్నాయి నిను ప్రేమించానని పేరుతో తెలుగు, హిందీ సినీ సంగీత విభావరి కార్యక్రమం శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్రనాయకుడు రమేష్‌బాబు, సిటీ సివిల్ కోర్ట్ సూపరింటెండెంట్ అంజనీకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామోజీస్వరసారథ్యంలో గాయనీగాయకులు నాగేశ్వర్‌రావు, వెంకట్‌రావు, బమిడిపాటి దీక్షితులు, కబీర్ పాషా, నరసింగ్‌రావు, టి. వాసు, మంగళంపల్లి స్వర్ణ, అనురాధ, మధురవీణ, భార్గవి, కమల, నాగశిరిషా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రముఖ గాయకుడు జె.వెంకటేష్‌ను ఘనంగా సత్కరించారు.

రాజ్యాంగబద్ధమైన వాటా కోసం బిసిలు ఉద్యమించాలి

-బాలగౌని బాలరాజ్‌గౌడ్

హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:
రాజ్యాంగబద్ధమైన వాటా కోసం బిసిలు ఉద్యమించాలని బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఓబిసి వర్గానికి చెందిన ప్రధాన మంత్రి ఓబిసిల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు. శుక్రవారం పొలిటికల్ ఫ్రంట్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌తో కలిసి మాట్లాడారు. చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణలో 42శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి 9వషెడ్యూల్లోచేర్చి అమలుచేయాలని, జనగణనలో కులగణను లెక్కించాలని, బిసిలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, కేంద్రంలో బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బిసి రక్షణచట్టాన్ని తీసుకురావాలని, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ను పునర్ సమీక్షించాలని, రోహిణి కమిషన్ అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ కులాలవారీగా బిసి కార్పొరేషన్ చైర్మన్లను ప్రకటించిన ప్రభుత్వం ఆ కార్పొరేషన్లకు అవసరమైన అధికారాలు, నిధులు, స్వయం నిర్ణయాధికారాన్ని ఇవ్వలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ బైరు శేఖర్, పోతగాని ఐలన్‌గౌడ్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో మే, జూన్ నెలల గోధుమల పంపిణీ

కంటోన్మెంట్, మే 8, ప్రభాతవార్త:
సికింద్రాబాద్ 9వ సర్కిల్ సివిల్ సప్లై పరిధిలో ఉన్న తెల్ల రేషన్ కార్డు హోల్డర్లకు మే, జూన్‌లకు సంబంధించిన గోధుమలు పంపిణీచేస్తున్నామని అసిస్టెంట్ సివిల్ ఆఫీసర్ చాముండేశ్వరి తెలిపారు. శుక్రవారం రెజిమెంటల్ బజార్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైట్ రేషన్ కార్డు హోల్డర్లు ఈకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలి

మార్కెట్‌యార్డు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

బెజ్జంకి, మే 8, ప్రభాతవార్త: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ నాయకుడు డిమాండ్ చేశారు. బెజ్జంకిలో బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో కలిసి మార్కెట్ యార్డు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ సరిపడే గన్నీ బ్యాగులను సమకూర్చాలన్నారు. గురువారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసిందని రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందన్నారు. రైతులకు సకాలంలో రైతు భరోసా అందించడం లేదన్నారు. బిఆర్ఎస్ సర్కార్ అధికారంలో ఉన్నంత కాలం రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రతి గింజను కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారే తప్ప పర్యవేక్షించిన పాపానపోలేదన్నారు. కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లారీల కొరతతో కొనుగోలు చేసిన ధాన్యం కేంద్రాలలోనే నిలిచిపోతుందని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగాల లక్ష్మణ్, బొల్లం శ్రీధర్ పెద్దన్న, వంగల నరేష్, కచ్చు రాజయ్య, బండి రమేష్, తిప్పరపు మహేష్, మహేందర్‌రెడ్డి, కల్లూరి రవి, కమటం శ్రీనివాస్, సంఘ నరేష్, వెంకటేశం, దోనె లక్ష్మణ్, లింగరావు, సంజీవరెడ్డి, తాడిచెట్టు భూమయ్య, కల్లూరి అజయ్, పొట్లపల్లి లక్ష్మణ్, వాసిమల్ల రమేష్, రావుల అనిల్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

ధాన్యం కొనుగోలు చేయకుంటే రోడ్లను దిగ్బంధం చేస్తాం

బిఆర్ఎస్ నేత తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మే 8, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నెల రోజుల నుంచి రైతులు ధాన్యాన్ని మార్కెట్ యార్డులో పోసి అక్కడే నిద్రిస్తుంటే ప్రభుత్వం కొనుగోలు చేయడంలో రైతులను గోస పెడుతుందన్నారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయకుంటే మండల కేంద్రంలో రోడ్లన్నీ రైతులతో కలిసి దిగ్బంధం చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సరైన వసతులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

రాయపోల్, మే 8(ప్రభాతవార్త): ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధించి అభ్యర్థుల ఇంటర్వ్యూలను శుక్రవారం రాయపోల్ ఎంపిడివో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడివో శ్రీనివాస్, ఎంపివో శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హతలు, వ్యాపార ప్రణాళికలు, ఆర్థిక పరిస్థితులను అధికారులు పరిశీలించారు. వివిధ యూనిట్లు 5 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, 2 ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాలు, 1 సోలార్ మోటార్, 2 పాలు ఇచ్చే పశువులకు సంబంధించిన రుణాల కోసం మొత్తం 68 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 55 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేసి వారికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రుణాలు మంజూరు చేయనున్నట్లు ఎంపిడివో శ్రీనివాస్ వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధిదిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు.

అక్కన్నపేటలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిజెపి నాయకులు

అక్కన్నపేట, మే 8, ప్రభాతవార్త : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అక్కన్నపేటలో బిజెపి నాయకులు గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తోట సరూపలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్థాయికి తగని విధంగా మాట్లాడిన కౌశిక్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేసి, బండి సంజయ్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చెరుకు సంపత్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, దిండ్ల రాజ్‌కుమార్, తిరుపతి నాయక్, లక్ష్మత్ నాయక్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎల్లం, సమిరెడ్డి, చంద్రం, బానోత్ అనిల్ కుమార్, లౌడియా రైనా నాయక్, శ్రీనివాస్, జీవన్ గౌడ్, సంజీవరెడ్డి, రమేష్, రాజశేఖర్, కుమార్, కనకయ్య, వికాస్ ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వంటేరు


విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ టౌన్, మే 8 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం బెజుగామ గ్రామంలో జరుగుతున్న మడేలేశ్వరస్వామి, శీతాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో శుక్రవారం బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు బెండె మధు, చిటుకుల మధుసూదన్‌రెడ్డి, శేరిపల్లి లక్ష్మణ్‌గౌడ్, వెంగళస్వామి, రాచకొండ స్వామి, ముత్యాల శ్రీకాంత్, డాక్టర్ శ్రీకాంత్, అంజయ్య, పోచయ్య, ఇంకమల్ల స్వామి, నర్సయ్య పాల్గొన్నారు.

అర్హులైనవారికి గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

-ఎఎంసి చైర్మన్ నరేందర్‌రెడ్డి

గజ్వేల్, మే 8 (ప్రభాతవార్త): అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గూడు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, స్థానిక కౌన్సిలర్ నక్క సంతోషి రాములుగౌడ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఇంటికి చేరుతాయని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, 7వ వార్డు కౌన్సిలర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, సమీర్, అయిత సత్యనారాయణ, సారిక శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు నేత, సత్యనారాయణ, శ్రవణ్, మామిడి సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ గృహప్రవేశంలో పాల్గొన్న నరేందర్‌రెడ్డి, నేతలు

గంగ కత్వా ఆధునీకరణ పనులకు మోక్షం

సదాశివపేట మే 8 ప్రభాతవార్త : మండల పరిధిలోని సూరారం గ్రామం నుండి మొదలయ్యే నిజాం కాలం నాటి గంగ కత్వ కాలువ ఆధు నీకరణకు జగ్గారెడ్డి చొరవతో ఎట్టకేలకు మోక్షం లభించింది. నిజాంకాలంలో నిర్మించిన ఈ కాలువ ఇప్పటివరకు మరమ్మతుకు నోచుకోలేదు. దశాబ్దాలపాటు మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా పనులకు మోక్షం కలుగలేదు. గంగకత్వ ఆయకట్టు రైతులు, స్థానిక నేతల కోరిక మేరకు జగ్గారెడ్డి రెండు నెలల క్రితం నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆధునీకరణ పనుల కోసం వెంటనే కొత్త ప్రతి పాదనలు రూపొందించాలని అధికారులకు సూచిం చారు. కాలువ ఆధునీకరణ పనులకు నీటి పారుదల శాఖ అధికారులు రూ.42 కోట్లతో ప్రతిపాద నలు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. ఆ ప్రతిపాదనలకు ప్రభుత్వం తాజాగా ఆమోదం తెలిపింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లో జగ్గారెడ్డి సమావేశం అయ్యారు. గంగకత్వ కాలు వకు చేపట్టబోయే ఆధునీకరణ పనులపై ఈ సమావేశంలో చర్చించారు.

ఆధునీకరణ పనులు ఇలా.....

గంగకత్వ కాలువ సదాశివపేట మండలం సూరారం గ్రామం లో ప్రారంభం అయ్యి 11 గ్రామాలను కలుపుతూ సదాశివపేట మండలం లోని మాచిరెడ్డి పల్లి గ్రామం వరకు 15 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉంది. గంగకత్వ కాలువకు 33 చెరువుల నుండి ఫీడర్ చానల్స్ ఉన్నాయి. ఆధునీకరణ పనుల్లో భాగంగా కాలువకు లైనింగ్ పనులు చేపడతారు. కాలువ పైన అవసరం ఉన్న చోట కొత్త బ్రిడ్జిల నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు చేస్తారు. దీనితో పాటు కాలువ పొడవునా తుములకు రిపేర్లు చేస్తారు. ఈ కాలువ పనులు పూర్తయితే 3000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు.

సిం రేవంత్‌రెడ్డితో శంకుస్థాపన...

సిఎం రేవంత్ రెడ్డి త్వరలో సంగారెడ్డి కి రానున్న నేపథ్యం లో గంగకత్వ పనులకు సైతం సీఎం తో శంకుస్థాపన చేయించేందుకు జగ్గారెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు త్వరత గతిన ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమక్షంలో జరిగిన సమావేశం లో అధికారులకు జగ్గారెడ్డి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకట స్వామి చేతుల మీదుగా గంగ కత్వ పనులకు శంకుస్థాపన జరుగుతుందని జగ్గారెడ్డి అధికారులకు వివరించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

గజ్వేల్ టౌన్, మే 8 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పల్లెపహాడ్ గ్రామానికి చెందిన మాడుగురి కరుణాకర్ ఇటీవల అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కరుణాకర్, వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌గుప్తా, కొమ్ము ఉమేష్‌యాదవ్, కీసర నరేష్‌గౌడ్, దువ్వల కనకయ్య, చింతకింది శ్రీను, చీరాల కిష్టయ్య, బలిపురం కిరణ్‌లు బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అనంతరం రూ.6వేల నగదుతోపాటు 50 కేజీల బియ్యం అందజేశారు.

ఎస్ఐని మర్యాద పూర్వకంగా కలిసిన కాంగ్రెస్ శ్రేణులు

బెజ్జంకి, మే 8, ప్రభాతవార్త : బెజ్జంకి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిపి ఒగ్గు దామోదర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన తోట తిరుపతిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తోట తిరుపతి మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రజలు, యువకులు, అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కర్రావుల సందీప్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, జెల్ల ప్రభాకర్, వార్డు సభ్యులు బి.రమేష్, ఎలిగే సతీష్, మచ్చ కుమార్, కత్తి రమేష్, పర్స సంతోష్, బోనగిరి ప్రభాకర్ పాల్గొన్నారు.

నూతన ఎస్ఐని సత్కారిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టొద్దు : ఎస్ఐ

కల్హేర్, మే 8, ప్రభాతవార్త: మండల పరిధిలోని రోడ్లపై రైతులు ధాన్యాన్ని ఎండబెట్టడం, శుభ్రపర్చుకోవడంలాంటివి చేయవద్దని ఎస్ఐ రవిగౌడ్ సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకుంటే ప్రజల రవాణ భద్రతకు ప్రమాదకంగా ఉంటుందని గుర్తు చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టుకోవడంతో అటుగా వెళ్లే వాహనాలు స్కిడ్ అయి బోల్తా కొట్టే పరిస్థితులు ఉంటాయన్నారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగా ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. అత్యవసర సేవల వాహనాలు వెళ్లడంతో అంతరాయం కలుగుతుందన్నారు. రహదారి వినియోగ నిబంధనలు ఉల్లంఘించినట్లుగా పరిగణించి కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల రవాణా భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రధాన రహదారులు, గ్రామ, అంతర్గత రహదారులపై ధాన్యాన్ని మార్పిడి చేయకూడదన్నారు. గ్రామ పంచాయితీ నిర్దేశించిన ప్రదేశాల్లో, వ్యవసాయ భూముల్లో ధాన్యం మార్పిడి, ఆరబెట్టుకోవడం లాంటివి చేసుకోవాలని ఎస్ఐ రవి గౌడ్ మండల రైతులకు సూచించారు.

కేశవ నాయక్ తండలో పశువులకు మందుల పంపిణీ

హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, మే 8, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అక్కన్నపేట మండలం కేశవ నాయక్ తండ గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పాడి, పంటలు సమృద్ధిగా ఉన్నప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని తెలిపారు. రైతులు పశుసంవర్ధకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ సుకన్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు రవి నాయక్, సర్పంచ్ సులోచన, ఉపసర్పంచ్ బాలాజీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

కొండపాక, మే 8, ప్రభాతవార్త : కుకునూరుపల్లి మండలం ఎల్లాయిగూడ గ్రామంలో బిఆర్ఎస్ కుటుంబ సభ్యుడు మాసపాక యాదయ్య భార్య భూదవ్వ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రైతుబంధు సమితి మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఎంపి టిటిల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెండ్ దేవి రవీందర్, సర్పంచ్ సుదర్శన్‌తో కలిసి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి వ్యక్తిగత సహాయంగా అయన రూ॥ 4 వేలు అందించారు. మనోధైర్యంగా ఉండాలని మృతురాలి భర్త యాదయ్యకు సూచించారు.

సున్నితపదాల్లో అద్భుతాలొలికించిన ఆత్రేయ

రవీంద్రభారతి, మే 8 ప్రభాతవార్త : గేయరచనల్లో దిట్ట అయిన ఆచార్య ఆత్రేయ అతి సున్నిత పదాల్లో అద్భుత భావాలు ఒలికించారని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, యువకళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో ఘనంగా జరిగిన ఆచార్య ఆత్రేయ 105వ జయంతికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిత్యానందరావు గౌరవ అతిథులు పొత్తూరి సుబ్బారావు, డా. పి.రాజేందర్‌కుమార్, పి.జ్యోతి, ఎస్వీ రామారావు, దైవజ్ఞ శర్మ, బొప్పన నరసింహారావు (బుజ్జి), సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులతో కలిసి ప్రముఖ వర్ధమాన గాయనీగాయకులు అఖిల, టి.బాల కామేశ్వరరావులను ఘనంగా సత్కరించి గానప్రవీణ బిరుదు ప్రధానంచేసి ప్రసంగించారు. దీక్షతో సినీలోకంలో ప్రవేశించిన ఆత్రేయ సంగీత ప్రపంచానికి తనదైన ప్రత్యేకశైలిలో లాలిత్యాన్ని, మాధుర్యాన్ని అందించారన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై ప్రత్యేక డ్రైవ్

సికింద్రాబాద్, మే 8 ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ జోన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం, ధూమపానం చేసేవారిపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు సికింద్రాబాద్‌జోన్ డీసీపీ రక్షిత కష్ణమూర్తి తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 38 పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు.. ఈ బృందాలు జోన్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ పార్కులు, స్మశాన వాటికలు, వైన్ షాపులు, జనావాసాలు లేని ప్రాంతాలతో పాటు ఇతర సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఈ ఆపరేషన్ వివరాలు: ఒకరు గంజాయి సేవిస్తున్న వ్యక్తిని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న 28 మందిని గుర్తించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవి స్తున్న 81 మందిపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారందరిపై కేసులు నమోదు చేశారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రజలకు అసౌకర్యం, ఇబ్బంది కలిగించే ఇటువంటి పనులను పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో బహిరంగ మద్యపానం, ధూమపానం. గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని డీసీపీ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

సిద్దిపేట సిపి రష్మీ పెరుమాళ్

వివరాలను వెల్లడిస్తున్న సీపీ రష్మీ పెరుమాళ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:

చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ సాధన రష్మీపెరుమాళ్ తెలిపారు. సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులకు అందించిన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా అచ్చంపేటకు చెందిన అవుల నాగమణి(34) అదే జిల్లాకు చెందిన అవుల లక్ష్మీ(44), కంకణాల మరియమ్మ(60), యాతం కోటేశ్వర్‌రావు(40), గంజనబోయిన దినేష్ (17) ముఠాగా ఏర్పడి బస్సులు, ఆటోలలో ప్రయాణించే మహిళలను లక్ష్యం చేసుకొని బంగారు అభరణాలు, నగదును దొంగతనం చేస్తున్నారని తెలిపారు. ముఠాలోని ఐదుగురులో ముగ్గురు మహిళలు ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు, తల్లి ఉన్నారని తెలిపారు. దొంగతనాలు చేసిన అనంతరం పారిపోవడానికి ఇన్నోవా కిరాయికి తీసుకున్నారని చెప్పారు. పది రోజుల క్రితం గుంటూరులో ఒక ఆటోలో ప్రయాణిస్తున్న వృద్ధురాలి చేతిలో ఉన్న బ్యాగులో విలువైన వస్తువులు ఉన్నాయని గమనించి ఆమెను ఏమార్చి బ్యాగులో నుంచి ఒక బంగారు నెక్లెస్‌ను చోరీ చేసినట్లు వివరించారు. గత నెల 30న యాదగిరిగుట్ట నుంచి వచ్చిన ఈ ముఠా జనగామ జిల్లా బచ్చన్నపేట బస్టాండ్ వద్ద ఒక కుటుంబం వద్ద ఉన్న నల్లటి బ్యాగును గమనించినట్లు తెలిపారు. ఆ కుటుంబం సిద్దిపేటకు వెళ్తున్న బస్సులో ఎక్కగా నాగమణి, లక్ష్మీ అదే బస్సులో ఎక్కినట్లు వివరించారు. బస్సులో రద్దీని అసరగా చేసుకొని నాగమణి అస్వస్థతగా నటిస్తూ బాధితురాలి దగ్గర కూర్చొని బ్యాగ్ తెరిచి అందులో ఉన్న బంగారు కాసులపేరును దొంగిలించినట్లు చెప్పారు. అనంతరం చేర్యాలలో దిగిన వీరు ముందుగా సమాచారం ఇచ్చిన ఇన్నోవా కారులో ఎక్కి అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. అదే ఇన్నోవా వాహనంలో చేర్యాల వైపు వస్తుండగా చుంచనకోట ఎక్స్‌రోడ్డ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనాలు చేసినట్లు అంగీకరించారని తెలిపారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు గోలుసు, కాసుల పేరు ఏడున్నర తులాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బంగారం ధరలు పెరగడంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, వృద్ధులు ఒంటరిగా ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమాన స్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 కు కాల్ చేయాలన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ అపూర్వ, కానిస్టేబుళ్లు రవి, ఆశోక్, హోంగార్డ్స్ శ్రీనివాస్, మంజుల, కవితలను అభినందించారు.

వైభవంగా అంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ట

చిన్నకోడూరు, మే 8, ప్రభాతవార్త : మండల పరిధిలోని అల్లీపూర్‌లో శుక్రవారం అంజనేయస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జై శ్రీరామ్ నినాదాల మధ్య జరిగిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు, భక్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్దకోడూరు మండల పరిధిలోని రంగనాయకసాగర్ అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని దర్శించుకొని రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేద వధువుకు చేయూత

సిద్దిపేట అర్బన్, మే 8, ప్రభాతవార్త : సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామానికి చెందిన పేద వధువు వివాహ్ నిమిత్తం మాజీ కౌన్సిలర్, బిఆర్ఎస్ నాయకులు దంపతులు ధర్మవరం స్వప్న బ్రహ్మం శుక్రవారం పుస్తెలు, మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ఆడపిల్లల వివాహాలకు అండగా ఉంటామన్నారు. ధర్మవరం దంపతులకు నూతన వధువు తల్లిందడ్రులు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన హరీష్‌రావు

సిద్దిపేట రూరల్, మే 8, ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని వివిధ ఫంక్షన్ హాళ్లలో జరిగిన పలు వివాహాలకు మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వరించారు. రెడ్డి ఫంక్షన్ హాల్, పోలీసు కన్వేన్షన్ హాల్, పద్మనాయక ఫంక్షన్ హాల్, శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్, నంగునూర్‌లోని బాలాజీ గార్డెన్స్, మల్లారం ఉజ్వల ఫంక్షన్ హాళ్లలో జరిగిన వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు

గజ్వేల్ టౌన్, మే 8 (ప్రభాతవార్త): పట్టణంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తలసేమియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ హాజరై మాట్లాడారు. హిమోగ్లోబిన్ తయారు చేసే కారణాలలో జన్యు మార్పుల వల్ల తలసేమియా వస్తుందని, హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్త కణాలలో ఉండే ఒక ప్రొటీన్ అని, ఇది శరీరం అంతా ఆక్సిజన్ అందిస్తుందని తెలిపారు. జన్యు మార్పుల వల్ల, మేనరికం వల్ల తల్లిదండ్రుల నుండి పిల్లలకు సంక్రమిస్తుందని తెలిపారు. హిమోగ్లోబిన్ అణువులు ఆల్ఫా మరియు బీటచైన్ అని పిలవబడే ప్రొటీన్ గొలుసుతో తయారు అవుతుందని అన్నారు. హిమోగ్లోబిన్ ఉండే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి నిలిచిపోవడాన్ని తలసేమియా వ్యాధి అంటారని, బిడ్డకు జన్మనిచ్చే వారి వల్ల ఈ ప్రాణాంతక వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మీనా, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఎం.శ్రీనివాస్, జనరల్ మెడిసిన్ డాక్టర్ సుమన్, ఆర్ఎంఓస్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీత, హెడ్ నర్సు ఉమ, రోజులిన్, నర్సింగ్ ఆఫీసర్స్ షబానా, స్వప్న, షాహిని, నజీర్, కవిత, ఉజ్మ, రేఖ, అయేషా, మమత, రచన, లక్ష్మీ, ఉమామహేశ్వరి, వకుళాదేవి, నిర్మల, పుష్ప, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, రాజు, సురేందర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకుందాం

సిద్దిపేట అర్బన్, మే 8, ప్రభాతవార్త : తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి రక్తదాతలు ముందుకు రావాలని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు, మిత్ర బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు వేణుగోపాల్‌చారి అన్నారు. అర్హులైనవారు రక్తదానం చేయాలని శుక్రవారం మిత్ర బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు నుంచి డిగ్రీ కళాశాల వరకు టు కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఈ మాట్లాడుతూ ఈ వ్యాధి జన్యుపరమైన వ్యాధిగా వస్తూ ఉంటుంది. దీనికి అనేక రకాలు కారణాలు ఉంటాయన్నారు. ప్రధానంగా మేనరికం పెళ్లిళ్ల తగ్గించేలా చూస్తే సమస్యలు తగ్గుముఖంపట్టే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారికి 20 రోజులకు ఒకసారి లేదా నెలకోమారు బ్లడ్ ఎక్కిస్తేనే బతికే అవకాశం ఉంటుందన్నారు. దాతలు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యులు భాస్కర్, గణేష్, సాయిరాం, భీమేష్, రమేష్, నాగస్పందన, శ్రీపతి, విష్ణువర్ధన్, రన్నర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, ఆసుపత్రి ప్రతినిధులు ఇమ్రాన్, నాగరాజు, వాకర్ అసోసియేషన్ సభ్యులు మిత్ర బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, వ్యాధిగ్రస్తుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సాగుపై రైతులకు అవగాహన

మిరుదొడ్డి, మే 8, ప్రభాతవార్త : మిరుదొడ్డి గ్రామంలో మండల వ్యవసాయ పరిశోధన స్థానం తోర్నాల, జిల్లా వ్యవసాయశాఖ సహకారంతో రానున్న వానాకాలం సాగుకై రైతులను సమాయత్తం చేయడానికి మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత సరిత మాట్లాడుతూ వరిలో కాండం తొలుచు పురుగు యాజమాన్యం, వివిధ వరి రకాలు, రైతులు విత్తనాలు కొన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ అధకారి రమేష్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటలో యాజమాన్య పద్ధతులు, వివిధ ఉద్యాన వన పంటలకు సంబంధించిన సబ్సిడీలు, బిందు సేద్యం స్కీమ్స్‌పై వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్ మాట్లాడుతూ మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాలు సాగుచేయాలని సూచించారు. కార్యక్రమంలో అఖిల్, రేఖ, సమాజాత, సర్పంచ్ మహేశ్వరి, ఉప సర్పంచ్ రాజు, రైతులు పాల్గొన్నారు.

తునికిమక్త గ్రామంలో పశువైద్య శిబిరం

వర్గల్, మే 8 (ప్రభాతవార్త): ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం వర్గల్ మండలం తునికిమక్త గ్రామంలో పశువైద్య, పశుసంవర్ధక శాఖ, తెలంగాణ పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా పశువైద్య శిబిరం, పాడి రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, గర్భ నిర్ధారణ పరీక్షలు, సాధారణ చికిత్సలు, కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన మేలుజాతి దూడల ప్రదర్శన, నట్టల నివారణ, దూడల సంరక్షణ, పోషణ, వేసవిలో పశు సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 10 గర్భకోశ చికిత్సలు, 32 పశువులలో గర్భనిర్ధారణ పరీక్షలు, 14 మామూలు చికిత్సలు చేయడం జరిగింది. అలాగే 26 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడిఏవిహెచ్ డాక్టర్ రమేష్‌బాబు, సర్పంచ్ పసుల స్వామి, ఉపసర్పంచ్ పసుల రేణుకయాదగిరి, డాక్టర్ కె.సృజన, మండల పశువైద్యాధికారి డాక్టర్ సర్వోత్తమ్, వేలూరు పశువైద్యాధికారి జె.భాస్కర్, గోపాలమిత్ర సూపర్వైజర్ గజ్వేల్ క్లస్టర్ ఏ.శ్రీరాములు, యు.ఆంజనేయులు, ఎస్.సురేష్, సిబ్బంది, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొండపాకలో...

కొండపాక, మే 8, ప్రభాతవార్త : మండల కేంద్రంలో శుక్రవారం పశు వైద్యశాల వద్ద ప్రజాపాలన ప్రగతి ప్రణళికలో భాగంగా రైతు వారోత్సవాల్లో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులకు, గేదెలకు గర్భకోశ సంబంధ చికిత్సలు నిర్వహించారు. అదే విధంగా రైతులకు వేసవి కాలంలో పశువులపట్ల తీసుకొవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 75శాతం సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంచాల నవీనశ్రీనివాస్, డిఎఒ స్వరూపరాణి, గోపాలమిత్ర కృష్ణమూర్తి, విజయడైరీ డిడి నాగేశ్వర్‌రావు, పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు వాటర్ ఫ్యూరిఫైర్ విరాళం

మర్కుక్, మే 8 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు వాటర్ ఫ్యూరిఫైర్‌ను దామరకుంట సర్పంచ్ పత్తి నర్సింలుయాదవ్, వర్ధరాజ్‌పూర్ సర్పంచ్ మాడబోయిన కిష్టయ్య సొంత ఖర్చులతో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది, స్టేషన్‌కు వచ్చే ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండేలా వాటర్ ఫ్యూరిఫైర్‌ను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో దామరకుంట ఉపసర్పంచ్ దేవి విజయ రమేష్, వార్డు సభ్యులు బక్కల ప్రభు తదితరులు పాల్గొన్నారు.

నేడు వారాహి ఆలయంలో హోమం

కొండపాక, మే 8, ప్రభాతవార్త : కుకునూరుపల్లి శివారులోని ఒక వెంచర్‌లో ఇటీవల ప్రతిష్టించిన వారాహి, ప్రత్యంగిరా, శరబేశ్వర దశమహ విద్యాలయంలో ఈ నెల 9న ఉదయం 9 గంటలకు విజయ గణపతి, సుబ్రమణ్య, కాలబైరవ, నవగ్రహ సమేత దశ మహవిద్య, వారాహి, ప్రత్యంగిరా, శరాబేశ్వర హోమం నిర్వహించడం జరుగుతుందని అలయ ప్రతినిధులు తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని వారు సూచించారు.

మ్యాపింగ్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

-2025 ఓటరు జాబితాతో అనుసంధానం తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలి

-ఓటరు జాబితాల ప్యూరిఫికేషన్, పారదర్శకత, కచ్చితత్వం కోసం ఈ ప్రక్రియ అత్యంత ముఖ్యం

-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 8, ప్రభాతవార్త:

రానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) -2026 కార్యక్రమాన్ని పురస్కరించుకొని భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో 2002 ఓటరు జాబితాలో నమోదైన ప్రతి అర్హులైన ఓటరు తమ వివరాలను 2025 ఓటరు జాబితాతో మ్యాపింగ్ (అనుసంధానం) చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఓటరు జాబితాల ప్యూరిఫికేషన్, పారదర్శకత, కచ్చితత్వం కోసం ఈ ప్రక్రియ అత్యంత ముఖ్యమని ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రతి ఓటరు తమ కుటుంబ సభ్యుల ఓటర్ ఐడి వివరాలతో సంబంధిత పోలింగ్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్(బిఎల్ఓ)ను సంప్రతించి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేయించుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రస్తుతం 2002 ఓటరు జాబితాలో నమోదైన ఓటర్ల వివరాలను 2025 ఓటరు జాబితాలో ఉన్న వివరాలతో సరిపోల్చి ధృవీకరించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రతికుటుంబం తమ ఇంటిలో ఉన్న ఓటర్లందరి ఓటర్ కార్డు వివరాలను ఒకేసారి బిఎల్ఓకు అందజేస్తే మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బిఎల్ఓలు ఇంటింటి సందర్శనలు నిర్వహిస్తూ ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారని, ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి సందేహాలు ఉన్నా సంబంధిత ఎన్నికల నమోదు అధికారులను లేదా బిఎల్ఓలను సంప్రతించాలని కలెక్టర్ సూచించారు.

హేమారెడ్డి మల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

-పాల్గొని పూజలు చేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

హేమారెడ్డి మల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నాగల్‌గిద్ద, మే 8, ప్రభాతవార్త:

మండలపరిధిలోని ఉట్‌పల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన హేమారెడ్డి మల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ఎమ్మెల్యే పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ, భక్తిమార్గంలోనే మానవుడికి ప్రశాంతత దక్కుతుందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో గ్రామాల్లో ఐక్యత పెరుగుతుందన్నారు. మహాభక్తురాలైన హేమారెడ్డి మల్లమ్మ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, మల్లమ్మ చూపిన బాటలో మనందరం పయనిద్దామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయకమిటీ బాధ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నాగల్‌గిద్ద, మే 8, ప్రభాతవార్త:

మండలపరిధిలోని ఆయాగ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పర్యటించారు. మండలపరిధిలోని ఎర్రబొగుడ(జయమ్మ, సంజీవ్ దంపతులు), గోమసాదుతండా(సునీత, సంజీవ్ దంపతులు)ల్లో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రబొగుడగ్రామంలోని ప్రాథమికపాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి నూతనంగా నిర్మించనున్న ప్రహరీగోడ నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమిపూజా కార్యక్రమాలు నిర్వహించి పనులనిర్మాణానికి శ్రీకారంచుట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్‌పాటిల్, ఉపసర్పంచ్ పండరి, జ్ఞానోభా రావుపాటిల్, గుండుపాటిల్, బ్రహ్మానందరెడ్డి, మాజీ సర్పంచులు, ఆయా శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణాగౌడ్

డాక్టర్ పర్వీన్ ఫాతిమా పశువులకు చికిత్సలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌడిపల్లి, మే 8, ప్రభాతవార్త:

ప్రభుత్వ పశువైద్యాధికారులతో నిర్వహించే పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సర్పంచుల ఫోరమ్ ఉపాధ్యక్షులు, గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణాగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం 99రోజుల ప్రజాపాలన-ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలో పశువైద్యాధికారి డాక్టర్ పర్వీన్ ఫాతిమా ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ శిబిరంలో పశువులకు పరీక్షలు, చికిత్సలు చేయడం జరిగింది. లేగదూడల ప్రదర్శన, వేసవి కాలంలో పశువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన సదస్సును సైతం నిర్వహించడంజరిగింది. ఈ కార్యక్రమంలో వీరితోపాటు ఉపసర్పంచ్ శ్వేతామల్లికార్జున్‌గౌడ్, వివిఎల్‌వో కిషన్‌బాబు, జెవివో వేణు, ఎల్ఎస్ఎ రామకృష్ణ, వీరారెడ్డి, గోపాలమిత్రులు కవిత, విఠల్, నాయకులు రాగుల భూమయ్యపటేల్, బర్ల శరత్, మంగలి ఆశోక్‌నాయి, వీరేశంగౌడ్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు వరం

ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేస్తున్న ఎఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి

మునిపల్లి, మే 8, ప్రభాతవార్త:

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశానుసారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో నాలుగు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు వరంలా మారాయన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ కృషితో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయినాయన్నారు. కార్యక్రమంలో మాజీఎంపిపి రాంరెడ్డి, ఎంపిడిఒ అంజయ్య, ఇబ్రహీంపూర్ సర్పంచ్ ల్యాగాల ఆశోక్, ఉపసర్పంచ్ మొహియుద్దీన్, గ్రామశాఖ అధ్యక్షుడు షేక్ అలీ, యూత్ అధ్యక్షులు ప్రేమ్, వార్డుసభ్యులు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ధనాసిరి గుండా హైటెన్షన్ లైన్లు వేయొద్దు

-ఆర్డీఓకు ధనాసిరి గ్రామస్థుల వినతి

ఆర్డీఓ దేవుజాకు వినతిపత్రం అందచేస్తున్న ధనాసిరి గ్రామస్థులు

మొగుడంపల్లి, మే 8, ప్రభాతవార్త:

మండలంలోని ధనాసిరిగ్రామం గుండా హైటెన్షన్ లైన్లు ఏర్పాటు చేయొద్దంటూ గ్రామస్థులు శుక్రవారం ఆర్డీఓ దేవుజాకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంమధ్యలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తంచేశారు. గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుత్ స్తంభాల వైర్లు ప్రమాదవశాత్తు తెగిపడితే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. హైటెన్షన్ లైన్లను గ్రామం మధ్యలో నుంచి కాకుండా గ్రామశివారు ప్రాంతాల గుండా ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిచేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కౌన్సిలర్

నారాయణఖేడ్, మే 8, ప్రభాతవార్త:

ఖేడ్ మున్సిపల్ పరిధిలోని 1వ వవారఱ్ఱు చాండ్‌ఖాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కౌన్సిలర్ పత్రి లలితరామకృష్ణ చేతులమీదుగా ప్రారంభించారు. రైతుల తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని అన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని సెంటర్ నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

చిన్నశంకరంపేట, మే 8, ప్రభాతవార్త:

ఆధ్యాత్మికతతోనే మానసికప్రశాంతత లభిస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం మండలపరిధి శాలిపేటలో నిర్వహిస్తున్న పెద్దమ్మతల్లి దేవాలయ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయకమిటీ ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డప్పుచప్పుళ్లతో, బొట్టుపెట్టి మోడీ సభకు ఆహ్వానం

-ఎంట్రీ పాసులు అందచేసిన ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

న్యాయవాదికి ఎంట్రీపాస్‌ను అందచేస్తున్న ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్షురాలు

రామచంద్రాపురం, మే 8, ప్రభాతవార్త:

ఈ నెల 10వ తారీఖున ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నందున జన సమీకరణ కోసం బిజెపి నాయకులు వినూత్న రీతిలో ఆహ్వానం పలుకుతున్నారు. బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిలు శుక్రవారం రామచంద్రాపురంలో డప్పుచప్పుళ్లతో ఇంటింటికీ చేరుకుని శుభకార్యాలకు ఆహ్వానం పలికినట్లుగా నుదుట బొట్టుపెట్టి, ఎంట్రీ పాసులు అందించి సభకు ఆహ్వానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బలరాం, పద్మావతి తదితరులు ఉన్నారు.

యువతి కడుపులో 20 సెం.మీ. కణితి

-శస్త్ర చికిత్సతో తొలగించిన మెడికవర్ ఆసుపత్రి వైద్యులు

మాట్లాడుతున్న మెడికవర్ ఆసుపత్రి డాక్టర్లు

రామచంద్రాపురం, మే 8, ప్రభాతవార్త:

మహిళ కడుపులో పేరుకుపోయిన 20 సెంటీమీటర్ల కణితిని మెడికవర్ ఆసుపత్రివైద్యులు తొలగించి మహిళప్రాణాలను కాపాడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తివివరాల్లోకి వెళితే, సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్ మండలం బోడపట్ల గ్రామానికి చెందిన టి.సంధ్య(35) కడుపులోనొప్పి అంటూ రామచంద్రాపురం ఆశోక్‌నగర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరగా డాక్టర్లు జి.భవ్య, డాక్టర్ ఎస్.రఘురామిరెడ్డి, పరిశీలించగా కడుపులో 20సెంటీమీటర్ల మేర(ఫుట్‌బాల్ సైజులో) ఉన్న కణితి కనపడింది. భారీ అండాశయ కణితులు అరుదుగా కనిపిస్తాయని, సరైన సమయంలో చికిత్స అందకపోతే కణితి పగిలిపోవడం, అంతర్గత రక్తస్రావం, అండాశయం మెలికలు తిరగడం, సమీప అవయవాలపై ఒత్తిడి పెరగడం, శ్వాససమస్యలు రావడంలాంటి ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉంటాయని వైద్యులు పేర్కొన్నారు. కణితిలో క్యాన్సర్ దాగి ఉండే ప్రమాదం సైతం ఉంటుందని వైద్యులు అన్నారు.

మెగా జాబ్ మేళా విజయవంతం

జాబ్ మేళాకు హాజరైన నిరుద్యోగులు

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 8, ప్రభాతవార్త:

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన మెగా జాబ్ మేళాను శుక్రవారం సంగారెడ్డి జిల్లా తారా డిగ్రీ కళాశాలలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి అఖిలేష్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి సుమారు 1500మంది యువతీయువకులు హాజరయ్యారని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటి, మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీస్‌సెక్టార్ తదితర రంగాలకు చెందిన సుమారు 60 ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థులకు సంబంధిత కంపెనీలు యువజన, క్రీడల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు అఖిలేష్‌రెడ్డి తెలిపారు.

ఉచిత రొమ్ముక్యాన్సర్ పరీక్ష శిబిరం

గుమ్మడిదల, మే 8, ప్రభాతవార్త:

గుమ్మడిదల మున్సిపాలిటీపరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఉచిత రొమ్ముక్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎఐజి హాస్పిటల్, తెలంగాణ ప్రభుత్వం, గ్రామ్యాల్స్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటుచేశాయి. ఈశిబిరానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైస్‌చైర్మన్ చిమ్ముల సంధ్యాగోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఎస్.మధుకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. శిబిరంలో సుమారు 70మంది మహిళలకు పూర్తిస్థాయిలో రొమ్ముక్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నివేదికలను మూడురోజులలో అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలు ఆరోగ్యపరీక్షలను నిర్లక్ష్యంచేయకుండా తరచుగా పరీక్షలుచేయించుకోవాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో గ్రామ్యాల్స్ సంస్థకు చెందిన డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి, కాంగ్రెస్‌కౌన్సిలర్లు మూడుచింతల నరేందర్‌రెడ్డి, మురళి, రమేష్, మహేష్, చక్రపాణి వికె, రెడ్డిగారి పద్మ, తుపాకుల రాధిక, ఆర్ల కిషన్, ఆకుల మాధవి, పొన్నాల ప్రమీలతోపాటు నాయకులు హెచ్ఈఒ శ్రీనివాస్, సూపర్వైజర్ లక్ష్మి, ఎంఎల్హెచ్‌పి కళ్యాణి, ఏఎన్ఎంలు స్వరూప, శాంతన, వసుంధర, ఆశాకార్యకర్తలు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

పశువుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలి

-పశువైద్యాధికారి డాక్టర్ సునిల్‌దత్

మిర్జంపల్లి తండాలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక దృశ్యం

మొగుడంపల్లి, మే 8, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మిర్జాంపల్లి తండాలో శుక్రవారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ సునిల్‌దత్ రైతులకు పలుసూచనలు చేశారు. పశువుల ఆరోగ్యం, పోషణ విషయంలో రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నవీన్ కుమార్, డైరీఫామ్ అధికారులు, వ్యవసాయ అధికారులు, సర్పంచ్ సుభాష్, పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం అమ్మొద్దు

రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదె చంద్రం...

కొనుగోలు ప్రారంభిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ బాదె చంద్రం

రామాయంపేట, మే 8, ప్రభాతవార్త:

దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని రామాయంపేట వ్యవసాయ సహకారసంఘం చైర్మన్ బాదె చంద్రం రైతులకు సూచించారు. రామాయంపేట పిఎసిఎస్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ 7వ వార్డు పరిధిలోని గొల్పర్తిలో పిపిసి ధాన్యం కొనుగోలుకేంద్రం (సబ్‌సెంటర్)ను 7వవార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజుతో కలిసి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ బాదె చంద్రం మాట్లాడుతూ రైతులు తమధాన్యాన్ని దళారులకు అమ్మకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుట్టి సందీప్, కోఆప్షన్ సభ్యుడు గౌస్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి, నాయకులు పోచమ్మల గణేష్, డాకి స్వామి, చింతల యాదగిరి, మోబిన్, రాము, చిలుక విరాట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు రైతులు హాజరై కొనుగోలు కేంద్రం ప్రారంభాన్ని స్వాగతించారు.

పశువైద్య చికిత్సపై అవగాహన శిబిరం

టేక్మాల్‌లో పశువైద్య చికిత్సపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టేక్మాల్, మే 8, ప్రభాతవార్త:

ప్రణాళికలో భాగంగా ప్రాథమిక పశు వైద్యశాల టేక్మాల్‌లో శుక్రవారం పశువైద్య అవగాహనశిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని సర్పంచ్ సుధాకర్ ప్రారంభించి దూడలకు నట్టలనివారణ మందును పంపిణీ చేశారు. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందచేశారు. స్థానిక పశువైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ వేసవిలో రైతులు పశుసంరక్షణపై ప్రత్యేక దృష్టి ఉంచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, పశువైద్య సిబ్బంది హనుమంతు, అమరావతి, గోపాలమిత్రలు, దీపక్. రవి, దేవరాజ్, సిబ్బంది ఆనంద్, కృష్ణ, శామల, గ్రామైరైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

కొనుగోలు కేంద్రం పరిశీలిస్తున దృశ్యం

కొండాపూర్, మే 8, ప్రభాతవార్త:

కొండాపూర్ మండలంలోని ఆయాగ్రామాలు మండలకేంద్రంమైన కొండాపూర్, తెర్పోల్, గొల్లపల్లి, తొగర్పల్లి పిఎసిఎస్ సిఈఒలు, వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. ధాన్యం కొనుగోలుకేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి కనీససౌకర్యాలు కల్పించి, ధాన్యంసేకరణ వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా మల్కాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ధాన్యం నిల్వలు, గన్నీ సంచుల లభ్యతను పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

-మే 11న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

-సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మల్లేశం

రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మల్లేశం

చిలిపిచెడ్, మే 8, ప్రభాతవార్త:

సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చిలిపిచెడ్ మండల బండపోతుగల్ గ్రామంలో కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది. ఈసందర్భంగా సిపిఎం మెదక్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.మల్లేశం మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వరి,మొక్కజొన్న, జొన్నల కోతలు ప్రారంభమయ్యాయని అన్నారు. ధాన్యం కొనుగోలుకేంద్రాలను ప్రారంభం చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. అవసరమైన కొనుగోలుకేంద్రాలను ఏర్పాటుచేయక పోవడం వలన అకాలవర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మెదక్ జిల్లాలో వరిపంట కోతలు ప్రారంభమై 20రోజులు కావస్తున్నా, ఇంకా వడ్ల కొనుగోలుకేంద్రాలు, అంతటా ఏర్పాటుచేయకపోవడంతో జిల్లాలో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువధరకు వడ్ల అమ్మకాలు చేసి, నష్టపోతున్నారన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసిన చోట కనీసం మంచినీటి టెంటు సౌకర్యం ఏర్పాటుచేయకపోవడం జిల్లాలోని అధికారుల పనికి నిదర్శనం అని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వం తేమశాతాన్ని 17 శాతంగా కేటాయించిందని, కాని రైస్‌మిల్లు యాజమాన్యాలతో అధికారులు కుమ్మక్కై 10శాతంనుండి 13శాతం తేమశాతంతో రైతులచేత తూకం వేయిస్తున్నారని అన్నారు. 40.600కెజిలకుగాను 45 కెజిలుగా బరువును తరువుగా చూపించి తూకం వేయిస్తున్నారని అన్నారు. గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వడ్లు తడిసిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు. కాబట్టి లారీల ఏర్పాట్లపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని, అలాగే దళారులను నియంత్రించాలన్నారు. వెంటనే కొనుగోలుకేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలని, వడ్ల కొనుగోలు స్పీడప్ చేయాలని డిమాండ్ చేశారు. మే 11న రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు సమస్యలపై కలెక్టర్ కార్యాలయల ముందు ధర్నాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.మల్లేశం, అజ్జమర్రిశాఖ కార్యదర్శి శేఖర్, నర్సింలు, రైతులు పాల్గొన్నారు.